సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 13, నవంబర్, 2024



భద్రత చర్యలు కరువు..

అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల భద్రతపై యాజమాన్యం దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 8లో



నేడు 'కేటీపీఎస్' ఎన్నికలు

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 22°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై, వాతావరణం చల్లగా ఉంటుంది. కొన్ని చోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వృద్ధుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న భానుమతి

భద్రాచలంటౌన్: తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని, వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. పట్టణంలోని 'మానవ సేవ' అనాథాశ్రమంలో మంగళవారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నిరాదరణకు గురైన వృద్ధులు సీనియర్ సిటిజన్స్ యాక్ట్ ప్రకారం ఆర్డీఓ కోర్టులో దరఖాస్తు చేస్తే సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం బదిరుల పాఠశాల, బాలవికాసం స్కూల్‌లో జరిగిన సదస్సుల్లోనూ ఆమె మాట్లాడారు. అంతకుముందు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మెండు రాజమల్లు, సరోజిని, రఫీ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో జెన్‌కో డైరెక్టర్ పర్యటన



కర్మాగారంలో డైరెక్టర్ లక్ష్మయ్య, అధికారులు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా యూసీబీ, బాయిలర్, కోల్ ప్లాంట్‌లను తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తితో ఆటంకం లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్ఈ కృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు కొత్తగూడెంలో జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా 30 మంది ఎంపికకు ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డిగ్రీ లేక బీటెక్ ఉత్తీర్ణులైన వారు ఉదయం 10 గంటల్లోపు హాజరు కావాలని, వివరాలకు 98667 74459 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఈ పోస్టు దక్కేదెవరికో?

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ఎస్ఈ పోస్టు భర్తీపై ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం సర్కిల్ ఇంజనీర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించిన నర్సింగరావు గతనెల 31న రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగానే ఉండడంతో ఎవరిని నియమిస్తారోనని శాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత నెలలో నర్సింగరావు సెలవులో వెళ్లినప్పుడు పాలేరు ఈఈ ఎం.వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా ఈసారి పోస్టు ఖాళీగానే ఉంచడం గమనార్హం. అయితే, ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ.వందల కోట్ల విలువైన సీతారామ ప్రాజెక్టు, మున్నేరు రిటైనింగ్ వాల్స్ పనులు జరుగుతుండడంతో పలువురు ఇంజనీర్లు ఎస్ఈ పోస్టు కోసం మంత్రుల ద్వారా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గత వారం రోజులుగా నియామకంపై ప్రచారం జరుగుతున్నా ఎటూ తేలడం లేదు. దీంతో కొత్త వారికి అవకాశం ఇస్తారా లేక గతంలో ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తించిన పాలేరు ఈఈ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు ఇస్తారా అన్న మీమాంస నెలకొంది.

కొనుగోళ్లలో కొర్రీలు!



జూలూరుపాడు సబ్‌మార్కెట్‌లో పత్తి లోడ్ చేస్తున్న హమాలీలు

నష్టపోతున్న పత్తి రైతులు

- అందని ద్రాక్షగానే గిట్టుబాటు ధర
- పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన
- పట్టించుకోని అధికారులు

జూలూరుపాడు: పంట చేతికందే దశలో ప్రకృతి వైపరీత్యాలు.. ఎంతో కొంత దిగుబడి వచ్చిన పత్తిని మార్కెట్‌కు తీసుకొస్తే సవాలక్ష ఆంక్షలు.. వెరసి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక ప్రైవేట్‌గా విక్రయించాలనుకున్నా వ్యాపారులు అనేక కొర్రీలు పెడుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది పత్తి విత్తనాల సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 2.10 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. జిల్లాలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల మేర పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే చేతికందే దశలో అధిక వర్షాలతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లకు మించ లేదు. కొద్దో, గొప్పో చేతికందినా.. మార్కెట్‌కు తీసుకొస్తే తేమశాతం అధికంగా ఉందని, రంగు మారిందని, నాణ్యత లేదనే సాకుతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మంత్రి ఆదేశాలూ బేఖాతర్..

అక్టోబర్‌లో పత్తి పంట విక్రయానికి తేగా క్వింటా రూ. 5,200 నుంచి రూ. 6వేల ధర పలికింది. ఇక ప్రస్తుతం మార్కెట్‌లో జెండా పాట రూ.6,600 నుంచి రూ.6,800 వరకు ఉంటున్నా.. ఒకరిద్దరు రైతులకు మాత్రమే ఆ ధర పెడుతున్నారు. ఆ తర్వాత రూ. 5,500కు మించి వ్యాపారులు చెల్లించడంలేదని రైతులు చెబుతున్నారు. పత్తిలో తేమ శాతంతో సంబంధం లేకుండా క్వింటా రూ.6,900 చొప్పున కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఆదేశించినా.. అది అమలు కావడం లేదని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తి క్వింటాకు రూ.7,521 మద్దతు ధరగా నిర్ణయించినా జిల్లాలో ఎక్కడా ఆ ధర పెట్టడం లేదని, పలు రకాల సాకులు చూపిస్తూ తక్కువ ధరకే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఉప మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు చేస్తుండగా క్వింటా ధర రూ. 6,400 – రూ. 6,500 మధ్యనే చెల్లిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఒకే ధర నిర్ణయిస్తున్నారు. ప్రతీ రోజు కొనుగోళ్లు ప్రారంభించే ముందు మొక్కుబడిగా జెండా పాట పెడుతున్నా, ఆ తర్వాత తక్కువ ధరకే కొంటున్నారు. ఇక సుజాతనగర్‌లో సీసీఐ కేంద్రం ఉన్నా.. అక్కడ సవాలక్ష నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారని, దీంతో తక్కువ ధరకైనా జూలూరుపాడు సబ్ మార్కెట్‌లోనే పత్తి విక్రయిస్తున్నామని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

నిబంధనల ప్రకారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా లైసెన్స్ పొందిన ట్రేడర్లు జూలూరుపాడు సబ్ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన పత్తి కొనుగోలు చేయాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తల్లాడ, కొణిజర్ల, ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లి ములకలపల్లి తదితర మండలాల రైతులు పత్తి విక్రయానికి ఎక్కువగా ఈ మార్కెట్‌కే వస్తుంటారు. అయితే ఇక్కడ వ్యవసాయ మార్కెట్ అధికారులు, తూనికలు, కొలతల అధికారుల పర్యవేక్షణ లేక తాము ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ధర తగ్గించడంతో పా టు తూకంలోనూ తేడా వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఏన్కూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి డి.బజారును వివరణ కోరగా మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని, అతిక్రమించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటే మద్దతు ధర లభిస్తుందని చెప్పారు.

పత్తి ధర దయనీయం..



పత్తి ధర దయనీయంగా మారింది. మార్కెట్‌కు పత్తి తీసుకొస్తే వ్యాపారులు నాణ్యత లేదంటూ క్వింటా రూ. 6,400 చొప్పున కొనుగోలు చేశారు. ఈ ఏడాది నాలుగెకరాల్లో పత్తి సాగు చేస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. పంట సాగు కోసం చేసిన అప్పులు కూడా తీర్చే పరిస్థితి లేదు.

– గుగులోత్ లింగ్యా, గుండ్లరేవు, జూలూరుపాడు మండలం

పెట్టుబడి కూడా కష్టమే..



ఈ ఏడాది నాలుగెకరాల్లో పత్తి సాగు చేశా. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పరిసర ప్రాంతాల్లోని మార్కెట్లలో తక్కువ ధరకు అడుగుతున్నారని జూలూరుపాడుకు తీసుకొచ్చా. ఇక్కడ క్వింటా రూ. 6,400 చొప్పున కొనుగోలు చేశారు. అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవు.

– సున్నం రాజు, మూకమామిడి, ములకలపల్లి మండలం



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య. పక్కన కలెక్టర్ పాటిల్, ఎస్పీ తదితరులు

అట్రాసిటీ కేసులు

సత్వరమే పరిష్కరించాలి

- ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- సింగరేణి ప్రధాన కార్యాలయంలో లైజన్ సెల్ ప్రారంభం



సింగరేణి కార్యాలయంలో లైజన్ సెల్‌ను ప్రారంభిస్తున్న బక్కి వెంకటయ్య

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం): ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని, నెల రోజుల్లో పరిష్కరించి నివేదిక అందజేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. స్థానిక ఐడీఓసీలో మంగళవారం ఆయన రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు నెలలకోసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ప్రతీ నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు సూచించారు. గ్రామాల్లో నిర్వహించే సివిల్ రైట్స్ డేకు అన్ని కులాల వారు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఆయా మండలాల తహసీల్దార్లు, ఎస్ఐలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. భూ సమస్యలు, మూఢ నమ్మకాలు తదితర సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అట్రాసిటీ కేసుల బాధితులకు పరిహారం అందేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భూ సమస్యలపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కోర్టు మంజూరుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలని, స్టేషన్ వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మొత్తం కేసులపై తహసీల్దార్ల నుంచి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిని 30 రోజుల్లో పరిష్కరించి కమిషన్‌కు రిపోర్ట్ అందిస్తామని చెప్పారు. ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో గత పదేళ్లలో 893 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయని, వాటిలో 31 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, నెల రోజుల్లో పరిష్కరించి నివేదిక అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్నందున వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కోరారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ రాహుల్, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఎస్పీలు రెహమాన్, సతీష్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఇందిర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే లైజన్ సెల్..

సింగరేణిలో సుమారు 12 శాతం మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి లైజన్ సెల్ వేదిక కానుందని వెంకటయ్య అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్(పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి, పర్సనల్ జీఎం కవితానాయుడు, ఎస్సీ, ఎస్టీ చీఫ్ లైజన్ అధికారులు దుర్గం రాంచందర్, వీసం కృష్ణయ్య, సభ్యులు కె.నీలాదేవీ, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లాల శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, ఆంతోటి నాగేశ్వరరావు, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రావు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



వివరాల నమోదును పరిశీలిస్తున్న పీఓ

భద్రాచలంటౌన్: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. పట్టణంలోని గొల్ల బజార్‌లో చేస్తున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సూపర్‌వైజర్లు, ప్రత్యేకాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వివరాలు పొందుపరచాలని చెప్పారు. అన్ని స్థాయిల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, సర్వేలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. నమోదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచాలని, ప్రతి ఎన్యుమరేటర్ కేంద్రాల్లో డేటా ఎంట్రీ సిబ్బంది ద్వారా పొరపాటు జరగకుండా చూడాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు సర్వే ఉపకరిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధార్, రేషన్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను ఎన్యుమరేటర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అనంతరం రాజుపేట కాలనీ జీపీఎస్‌ను సందర్శించి పాఠశాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పిల్లలంతా రెగ్యులర్‌గా వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

18 నుంచి జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అన్నపురెడ్డిపల్లి గురుకుల కళాశాలలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వరాచారి తెలిపారు. డీఎస్ఓ చలపతిరాజుతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తేవడంతో పాటు వారిలో కొత్త ఆలోచనలు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని అన్నారు. 'సుస్థిర భవిష్యత్ కోసం శాస్త్ర సాంకేతిక రంగం' అనే అంశంతో పాటు ఏడు ఉప అంశాలపై విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉండే ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులు, అధికారులకు సూచించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని, వివరాలకు 92472 96012, 98492 29350 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

త్వరలో ఆర్టీసీ పెట్రోల్ బంక్

ఇల్లెందు బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్ఎం



ఇల్లెందు బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న ఆర్ఎం, కొత్తగూడెం డీఎం

ఇల్లెందు: ఇల్లెందు బస్టాండ్ ఆవరణలో త్వరలో ఆర్టీసీ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు విచారణ పూర్తయి, అనుమతులు తుది దశలో ఉన్నాయని ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం సరిరామ్ తెలిపారు. మంగళవారం ఆయన కొత్తగూడెం డీఎం ఎం.దేవేందర్‌గౌడ్‌తో కలిసి బస్టాండ్, డిపోను తనిఖీ చేశారు. ఇల్లెందు డిపోలో ఆర్టీసీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో ఇల్లెందు డిపో అప్‌గ్రేడ్ కాబోతోందని, డిపో, బస్టాండ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. తాగునీరు, లైటింగ్ ఏర్పాటుతో పాటు రెగ్యులర్ కంట్రోలర్‌ను నియమిస్తామని చెప్పారు. భద్రాచలం, మణుగూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ఏసీ బస్సులు కొన్నింటిని ఇల్లెందు మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇల్లెందు డిపోలో సూపర్‌లగ్జరీ బస్సులన్నీ కొత్తవే ఉన్నాయని, పల్లెవెలుగు బస్సులు కూడా కొన్ని కొత్తవి వస్తాయని వివరించారు. రూట్లు పెరిగితే డిపోకు లాభాలు వస్తాయన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించాలని ప్రయాణికులను కోరారు. ఖమ్మం నుంచి సాయంత్రం సమయంలో ఇల్లెందుకు బస్సులు ఉండటం లేదని కొందరు ఆర్ఎం దృష్టికి తేగా, ఏ సమయాన అందుబాటులో లేవనే విషయం స్పష్టంగా చెబితే ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోలతో పోలిస్తే ఇల్లెందు డిపో నష్టాల్లో ఉందన్నారు. మహాలక్ష్మి పథకం ఆర్టీసీని ఇబ్బందుల పాలు చేస్తోందా? అన్న ప్రశ్నకు.. ఆ పథకం ద్వారానే సంస్థ గట్టెక్కిందన్నారు. కార్యక్రమంలో స్థానిక డిపో మేనేజర్ సంజీవరాణి పాల్గొన్నారు.

భద్రాచలం డిపోను సందర్శించిన ఆర్ఎం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోను ఖమ్మం ఆర్ఎం సరిరామ్ సందర్శించారు. భద్రాచలం డిపో ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్న బంగారు గని అని, ఇక్కడి గ్యారేజీ సిబ్బంది, ఉద్యోగులు కృషి చేస్తే మరింత లాభాలు ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేస్తే సంస్థకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆయన వెంట డీఎం తిరుపతి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతమి ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

డీఐఈఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా బోధన కొనసాగాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి(డీఐఈఓ) హెచ్.వెంకటేశ్వర్లు అధ్యాపకులకు సూచించారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. చదువుతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా అధ్యాపకులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. చెడు వ్యసనాల బారిన పడకుండా, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగితే అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ఎంఎల్‌టీ విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. చిన్నా, అధ్యాపకులు సీహెచ్ నాగేశ్వరరావు, ఎస్.కుమార్, జి.శ్రీనివాస్, పీవీవీఎస్ఎన్ మూర్తి, కొండా ముకుందం, సాహితి, జరీనా, భాను, నరేష్, శివ, రేష్మా, లక్ష్మీదీపిక, రమేష్, దివ్య పాల్గొన్నారు.

మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి



చేప పిల్లలు వదులుతున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలు పెంచి, విక్రయించడం ద్వారా మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని ఊట్లపల్లి వెంకమ్మ చెరువులో మంగళవారం ఆయన చేప పిల్లలను వదిలారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని ఆసుపాక, దబ్బతోగు, అనంతారం, గాండ్లగూడెం, బచ్చువారిగూడెం, నారాయణపురం, తిరుమలకుంట గ్రామ పంచాయతీల్లో గల 9 చెరువులకు 5,40,750 చేప పిల్లలు అందజేస్తున్నట్లు తెలిపారు. వాటికి సరైన దాణా అందించాలని, అవి పెరిగిన తర్వాత మార్కెట్‌లో విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఏఓ శివరాం ప్రసాద్, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది మిడియం మంగరాజు, భార్గవ్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

మునగ సాగు లాభదాయకం

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చంద్రుగొండ : మునగ పంట సేద్యంతో రైతులకు మంచి లాభాలు వస్తాయని, రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక రైతువేదికలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల రైతులకు మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మునగ సాగుతో ఆర్థికంగా బలోపేతం అవుతారని చెప్పారు. ఏడు నెలల్లోనే పంట చేతికందుతుందని, ఎకరాకు రూ.60 వేలకు పైగా ఆదాయం వస్తుందని వివరించారు. విత్తనాలు లేదంటే మునగ మొక్కలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, ఏఓలు వినయ్, అనూష, ఏపీఓలు సంతోష్‌కుమార్, శ్రీను, ప్రమీల పాల్గొన్నారు.

క్లుప్తంగా

విచారణ చేపట్టిన ఆర్జేడీ



ఉపాధ్యాయులను విచారిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

దమ్మపేట: గతంలో ఎంఈఓగా పనిచేసిన వనమా వెంకటేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు రాగా.. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఎంఈఓపై ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులను మండల విద్యా వనరుల కేంద్రంలో విచారించారు. దమ్మపేట, మల్కారం ఉన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల బోధనలో అనుసరించాల్సిన మెళకువలు, బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు సమగ్రంగా వివరించారు. విద్యా వనరుల కార్యాలయంలో ప్రతి మంగళవారం దివ్యాంగులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్జేడీ సీసీ మాధవరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, దమ్మపేట హెచ్‌ఎం ఉషా తదితరులు పాల్గొన్నారు.

సంచార వాహనాల ద్వారా మెరుగైన సేవలు



రికార్డులు తనిఖీ చేస్తున్న కోఆర్డినేటర్ భగీశ్‌మిశ్రా

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాల కోసం నిర్వహిస్తున్న 1962 పశువైద్య సంచార వాహనాల ద్వారా క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలందించాలని స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భగీశ్‌మిశ్రా సూచించారు. ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, జిల్లా కోఆర్డినేటర్ ప్రణయ్‌తో కలిసి భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో 1962 వాహనాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల్లో అత్యవసర ఔషధాలు, రికార్డులను, పరికరాల పనితీరును పరిశీలించి మాట్లాడారు. పశువులకు మెరుగైన చికిత్స అందించేలా యజమానులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

క్రీడానైపుణ్యంతో బీటీపీఎస్ ప్రతిష్ట పెంచాలి



పోటీల్లో సాధించిన ట్రోఫీతో సీఈ బిచ్చన్న, ఉద్యోగులు

మణుగూరురూరల్: ఉద్యోగులు క్రీడల్లోనూ రాణిస్తూ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) ప్రతిష్ట పెంచాలని సీఈ బి.బిచ్చన్న సూచించారు. ఇటీవల పాల్వంచలో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, వాలీబాల్ టోర్నీలో మణుగూరులోని బీటీపీఎస్ ఉద్యోగులు ప్రతిభ చాటి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మంగళవారం సీఈని కలవగా ఆయన అభినందించి మాట్లాడారు. సంస్థలో ఆసక్తి ఉన్నవారు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణమూర్తి, స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నర్సింహారావు, జట్టు మేనేజర్ బి.హేమ్లాతో పాటు పోటీలకు హాజరైన డి.రమేశ్, పి.రవితేజ, ఎం.నాగేశ్వరరావు, ఆర్.మురళి, జి.విజయ్‌రామ్, డి.సురేశ్, డి.వెంకటేశ్వర్లు, జి.గని, జి సంపత్‌రెడ్డి, జి.నవీన్‌రెడ్డి, పి.రవికుమార్, సీహెచ్.ప్రశాంత్, సీహెచ్.సాయిప్రసాద్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వైరారూరల్: షార్ట్ సర్క్యూట్‌తో కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గరికపాడు లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన మాతంగి గోపయ్య – సువార్త దంపతులు తమ పూరింట్లో అన్నం వండుకుంటున్న సమయాన షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. దీంతో గోపయ్య బయటకు వస్తుండడంతో కింద పడగా గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు చేరుకుని మంటలను అదుపు చేసేలోగా ఇల్లు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. కాగా, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు పంచనా నిర్వహించి రూ.లక్షన్నర మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తల్లాడ: తల్లాడ యూనియన్ బ్యాంక్ ఎదురుగా మంగళవారం మోటార్ సైకిల్ ఢీకొట్టిన ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లాడ కు చెందిన తడికమల్ల కృష్ణవేణి ఎస్‌బీఐ విని యోగదారుల సేవా కేంద్రంలో నగదు డ్రా చేసుకొని రోడ్డు దాటుతుండగా కల్లూరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణి తలకు తీవ్ర గాయం కాగా, 108వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.19,144

భద్రత చర్యలు కరువు..

- కార్మికుల రక్షణకు పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, కాంట్రాక్టర్ తిలోదకాలు
- కార్మిక చట్టంపై పట్టింపులేనితనం
- అనుభవం లేనివారితో పనులు



దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, (ఇన్‌సెట్) ఫ్యాక్టరీ ఆవరణలో రక్షణసూత్రాలతో ఏర్పాటు చేసిన బోర్డు

దమ్మపేట: తెలంగాణ ఆయిల్ ఫెడ్ పరిధిలో నిర్వహిస్తున్న అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుల విషయంలో యాజమాన్యం, కాంట్రాక్టర్ కనీస భద్రత చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 9న అర్ధరాత్రి సమయంలో ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన విషయం విదితమే. కాగా గతంలో (మే 26, 2022) జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన యువతి మరణించింది. ఈ ప్రమాదాలు ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యతారాహిత్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కనీస భద్రత లేదు..

కనీస భద్రతా పరికరాలైన హెల్మెట్, హ్యాండ్ గ్లోవ్స్, పొడవాటి బూట్లు వంటి సౌకర్యాలను ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు యాజమాన్యం కల్పించకపోగా, వీటిని ధరించాల్సిన ప్రాధాన్యత, ప్రయోజనాల పట్ల కార్మికులకు కనీస అవగాహన కూడా కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నవంబర్ 9న ప్రమాదం జరగగానే హడావుడిగా 11న భద్రత ప్రమాణాలకు సంబంధించిన అవగాహన బోర్డులను ఫ్యాక్టరీ ప్రాగణంలో నామమాత్రంగా ఏర్పాటు చేశారు. కానీ, భద్రతా చర్యలు మాత్రం చేపట్టలేదని తెలిసింది. ఫ్యాక్టరీలో భారీ యంత్రాలు గెలల అన్‌లోడింగ్, ఫైబర్ డంపింగ్, బుల్ ట్రాక్టర్ డ్రైవింగ్ పాయింట్ల వద్ద పనిచేస్తున్న కార్మికులు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తుండటం.. పలువురిని విస్మయానికి గురిచేస్తుంది.

మద్యం తాగి విధులకు..

కొందరు మద్యం తాగి ఫ్యాక్టరీకి వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే, మద్యం తాగారా లేదా అనే విషయంపై తనిఖీలు నిర్వహించాల్సిన యాజమాన్యం, ఆ విషయానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఫ్యాక్టరీకి అతి సమీపంలోనే బెల్ట్ దుకాణాలు ఉండటం కూడా చర్చనీయాంశంగా మారింది. ఫ్యాక్టరీలో మేనేజర్ కంటే కూడా లేబర్ కాంట్రాక్టర్‌కు చెందిన ఓ సూపర్‌వైజర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్మిక చట్టం, నిబంధనలకు తూట్లు

కార్మిక చట్టం ప్రకారం పనివేళల్లో కొన్ని సమయ పరిమితులు, నిబంధనలు ఉన్నాయి. వాటిని గాలికి వదిలేసిన ఫ్యాక్టరీ యాజమాన్యం, తమ స్వప్రయోజనాల కోసం కార్మికులతో 24 గంటలూ పనిచేయిస్తోందని, ఈ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, కార్మికులకు ఒక రోజు లో 8 గంటలకు ఒక షిఫ్ట్ చొప్పున మూడు షిఫ్టులు నిర్వహించాల్సి ఉంది. కానీ, ఫ్యాక్టరీలో షిఫ్టుల ప్రస్తావన కనుమరుగైందనే చెప్పవచ్చు. కనీస అనుభవం, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారితో ఫ్యాక్టరీలో బుల్ ట్రాక్టర్లను నడిపిస్తున్నట్లు సమాచారం.



ఫ్యాక్టరీలో భద్రత పరికరాలు ధరించకుండా పనిచేస్తున్న కార్మికులు

భద్రతా చర్యలు చేపడుతాం..



కార్మికుల భద్రత విషయంలో ఇక నుంచి కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తాం. కార్మికుల పనివేళల్లో షిఫ్టులను ఏర్పాటు చేసే అంశంపై యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నాం. మద్యం తాగి ఫ్యాక్టరీకి రాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. సెక్యూరిటీ వద్ద బ్రీత్ ఎనలైజర్‌ను కూడా ఏర్పాటు చేస్తాం.

– కల్యాణ్, మేనేజర్, పామాయిల్ ఫ్యాక్టరీ

కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీ అధికారులు

కరకగూడెం: మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో మంగళవారం ఓ ఇంట్లో నిల్వ చేసిన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అనంతారం ఎఫ్‌ఎస్‌ఓ గోవింద్ సిబ్బందితో కలిసి ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.2 లక్షల విలువ చేసే కలప లభించింది. కలపను స్వాధీనం చేసుకొని ఏడూళ్ల బయ్యారంలోని రేంజర్ కార్యాలయానికి తరలించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎఫ్‌ఎస్‌ఓలు కొండల్‌రావు, సేవియా, సూరయ్య, బీట్ ఆఫీసర్లు రోజా, లక్ష్మీనర్సు, రాంబాబు, బేస్ క్యాంపు సిబ్బంది గణేశ్, సాంబ, నవీన్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని మామిడిగూడెం గ్రామానికి చెందిన 30 ఏళ్ల మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ సత్యనారాయణ కథనం మేరకు.. మామిడిగూడెంనకు చెందిన తాళ్లూరి శ్రావణి గత నెల 25న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా సమాచారం లేక భర్త తిరుమల్‌దాస్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

తొమ్మిదో మైలు తండాలో అగ్ని ప్రమాదం

రెండు ఇళ్లు దగ్ధం.. ఆహుతైన సామగ్రి



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

టేకులపల్లి: ఇంట్లో దేవుడి వద్ద పెట్టిన దీపం గాలికి ఎగిసి పడి ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ సురేశ్, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన అజ్మీర భాశ్యా మనుమడు గణేశ్ అయ్యప్ప మాల వేశాడు. రోజువారీ లాగే మంగళవారం కూడా ఇంట్లో అయ్యప్ప చిత్ర పటం వద్ద దీపం వెలిగించి కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. గాలికి దీపం ఎగిసిపడి మంటలు ఇంటుకుని, రెండు ఇల్లులు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక వాహనం వచ్చే సరికి రెండు ఇళ్లు కాలిపోయాయి. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, వస్తువులు, ధ్రువీకరణ పత్రాలతో పాటు రూ.20 వేల నగదు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోదరుడు సురేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, వంట సామగ్రి అందజేశారు. మాజీ సర్పంచ్ బానోత్ భద్రునాయక్, నాయకులు ఈది గణేశ్, బోడ మంగీలాల్‌యక్, రామారావు, సర్దార్, రవి తదితరులు పాల్గొన్నారు . అలాగే, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, నాయకులు కిరణ్‌కుమార్, మంగీలాల్, ఇస్తారి తదితరులు కూడా బాధితులను పరామర్శించారు.

గంజాయి స్వాధీనం



నిందితుడితో ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని రాజుపేట వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి నుంచి నిషేధిత గంజాయిని మణుగూరు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ కథనం ప్రకారం.. మణుగూరు చేపలమార్కెట్‌కు చెదిన షేక్ ఇసాక్ వద్ద నుంచి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు 1.350 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రామానుజవరానికి చెందిన మణికుమార్ వద్ద రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేసి కొంత సేవించినట్లు విచారణలో ఇసాక్ చెప్పాడని, అతడు బీటీపీఎస్‌లో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడని, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గంజాయి విక్రయిస్తూ రిమాండ్‌కి వెళ్లి వచ్చాడని చెప్పారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



పుల్లారెడ్డి (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు వల్లెం పుల్లారెడ్డి (90) మంగళవారం మృతిచెందారు. బ్రిటీష్ పాలకులు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడినట్లు స్థానికులు చెప్పారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో మల్టీపర్పస్ వర్కర్...



తరుణ్ (ఫైల్)

జూలూరుపాడు: విద్యుదాఘాతంతో మల్టీపర్పస్ వర్కర్ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చింతలతండా మల్టీపర్పస్ వర్కర్‌గా బానోత్ వీరన్న, విజయ దంపతుల పెద్ద కుమారుడు బానోత్ తరుణ్ (23) నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. మంగళవారం తరుణ్ విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకొని చెట్ల కొమ్మలు నరుకుతున్న క్రమంలో 11 కేవీ లైన్‌కు చెట్ల కొమ్మలు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అయినా, తరుణ్ బతికే ఉన్నాడనుకుని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆరు నెలల కిందట పాల్వంచ మండలం నవభారత్ శేఖరంబంజరకు చెందిన పల్లవితో తరుణ్‌కు వివాహమైంది. మృతుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ దయానంద్ పేర్కొన్నారు.

రెండు లారీలు, జేసీబీ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలు, జేసీబీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని ఆనందపురం శివారులో సోమవారం అర్ధరాత్రి యార్డులో ఇసుక లోడు చేస్తున్న జేసీబీ, రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యార్డ్‌లో నిల్వ ఉంచిన సుమారు 20 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. వాహనాలను తహసీల్దార్‌కు అప్పగించామని ఎస్‌ఐ వివరించారు.

లారీ ఢీకొని వ్యక్తి..



అర్జున్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామశివారులో లారీ ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న, పాతమారేడుబాక గ్రామానికి చెందిన తెల్లం అర్జున్ (50) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం అర్జున్ వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంపై కన్నాయిగూడెం వెళ్లి సొంత గ్రామానికి తిరిగి వస్తున్నాడు. తూరుబాక శివారుకు రాగానే ఇసుక లారీ అర్జున్ ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

దుమ్ముగూడెం: మండలంలోని ఎర్రబోరు గ్రామానికి చెందిన పర్శిక కిరణ్ (18) పురుగుమందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. వ్యక్తిగత కారణాలతో కిరణ్ పురుగులమందు తాగి వాళ్ల పెదనాన్న ఇంటి ఎదుట వాంతులు చేసుకోగా గమనించి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కిరణ్ తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందగ అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఎస్‌ఐ వెంకటప్పయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్

నేలకొండపల్లి: కుటుంబ కలహాలపై పంచాయితీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బా, సూసైడ్ లేఖతో వచ్చి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు... సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన గోపికి నేలకొండపల్లి మండలానికి చెందిన యువతితో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి అమ్మాయి తరఫు బంధువులు నేలకొండపల్లిలోని ఓ పార్టీ కార్యాలయంలో పంచాయితీ నిర్వహించారు. అక్కడకు సూసైడ్ లెటర్, పురుగుల మందు డబ్బాతో వచ్చిన గోపి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ కేకలు వేశాడు. అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పురుగుల మందు తాగే యత్నం చేయగా పోలీసులు పురుగుల మందు డబ్బా లాక్కుని పంపించారు.

వ్యక్తి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వై.రాజు కథనం ప్రకారం.. ఆసుపాకకు చెందిన భూక్య రమేశ్ (32) మద్యానికి బానిక కాగా.. ఎనిమిదేళ్ల కిందట తన భార్య ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించిన రమేశ్ గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ఎస్‌ఐ స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై.రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

అశ్వాపురం/కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో ఉన్న 'మా పల్లె రుచులు' హోటల్‌లో పనిచేసే ఓ మహిళ మంగళవారం సిబ్బంది నివాసముండే క్వార్టర్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమెతో పాటు ఉంటున్న యువకుడు కనిపించకపోవడంతో అతడే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హోటల్ సిబ్బంది, పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వాపురం మండలం ఆమెర్ద గ్రామానికి చెందిన గంగాధర ఝాన్సీ(35)కి ఆమెర్దకు చెందిన వ్యక్తితో వివాహం జరగగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య గొడవలతో ఇద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారు. ఈక్రమాన ఝాన్సీ అశ్వాపురంలో నివాసం ఉంటుండగా నల్లగొండకు చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఆతర్వాత ఆయనతో గొడవలు జరగగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈక్రమాన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో ఉన్న 'మా పల్లె రుచులు' హోటల్‌లో ఆమె పనికి చేరగా, అక్కడే నల్లగొండ జిల్లా పెద్దవూర మండలానికి చెందిన పెద్దమళ్ల కోటేశ్వరరావు అలియాస్ బన్నీ కూడా చేరాడు. వీరిద్దరి నడుమ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీయగా ఇద్దరూ హోటల్ వెనకాల ఒకే ఒకేగదిలో నివాసముంటున్నారు. కాగా, సోమవారం రాత్రి హోటల్‌లో పని ముగిశాక గదికి వెళ్లిన వారు మంగళవారం ఉదయం టిఫిన్ చేసి తిరిగి గదికి వెళ్లారు. మధ్యాహ్నం వరకు రాకపోవడంతో యాజమాన్యం పరిశీలించగా ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడిఉంది. కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ చేరుకుని వివరాలు ఆరా తీయడంతోపాటు అప్పటికే ఆచూకీలేని బన్నీపై అనుమానంతో గాలింపు చేపట్టారు.

'ఏకలవ్య'ను సందర్శించిన అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్



విద్యార్థులు, ఉద్యోగులతో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మంగళవారం సందర్శించారు. పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బాలిక ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యాన ఆయన విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే, ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలే తప్ప అఘాయిత్యాలకు పాల్పడొద్దని హితవు పలికారు. కాగా, ఇతర రాష్ట్రాల అధ్యాపకులకు హిందీ, ఇంగ్లిష్ తప్పితే తెలుగు రాకపోవడంతో సమస్యగా ఉందని పలువురు చెప్పగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అలాగే, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ చేపట్టాలని ఆదివాసీ సంఘం నాయకులు వీరయ్యను కోరారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సున్నం సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు వినీల్, బాలాజీ, దేవా, సందీప్‌రెడ్డి, తెల్లం హరికృష్ణ, తెల్లం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేటీపీఎస్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు



కేటీపీఎస్ 5, 6వ దశల్లో ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరరావు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. కేటీపీఎస్ 5, 6వ దశలు, 7వ దశ బ్రాంచ్‌ల కార్యవర్గాలను ఎన్నుకునేందుకు స్థానిక ఇంజనీర్ల అసోసియేషన్ హాల్‌లో బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగనుంది. ఉదయం 8–30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేయగా సెక్రటరీ పదవి కోసం పోటీ పడుతున్న ఉద్యోగులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. కేటీపీఎస్ 5, 6వ దశల్లో 344, 7వ దశలో 277 ఓట్లు ఉన్నాయి. ఏఈ క్యాడర్ మొదలు ఏడీఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ, సీఈ వరకు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇప్పటికే పలు పదవులు ఏకగ్రీవం

కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో అసోసియేషన్ సెక్రటరీ పదవి కోసం డి.ఉమామహేశ్వరరావు, జీఎస్ఆర్ భవానీప్రసాద్ పోటీ పడుతున్నారు. ఇప్పటికే కోశాధికారిగా చంద్ర కళావతి, మహిళా రిప్రజెంటేటివ్‌గా పావని, అసిస్టెంట్ సెక్రటరీలుగా ప్రదీప్, దివాకర్, మధుసూదన్, రామారావు, శ్రీలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 7వ దశ బ్రాంచ్ సెక్రటరీ పోస్ట్ కోసం ఎస్‌కే యాస్మిన్, వై.రవికుమార్, ట్రెజరర్‌గా వి.నరేందర్, పి.సంపత్‌కుమార్, అడిషనల్ సెక్రటరీ పోస్టులు ఐదింటికి బి.వెంకటరావు, డి.రాజేశ్, జి.అరుణ్‌కుమార్, జి.రాజేందర్, హెచ్.కిషన్, కె.శ్రీనివాసరావు, కె.ఉదయ్‌కిరణ్, ఎండీ అక్బర్‌పాషా, ఎం.గణేశ్, ఎస్.నాగరాజు పోటీలో ఉన్నారు. ఇప్పటి వరకు బ్రాంచ్ సెక్రటరీగా ఉన్న పి.బ్రహ్మాజీ జెన్‌కో వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవమయ్యారు. అలాగే, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా ఎం.రాజేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ(థర్మల్) యాకూబ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాంత్, 5, 6 దశల నుంచి జెన్‌కో డిప్యూటీ సెక్రటరీ (థర్మల్)గా ఎం.శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పత్తి కొనుగోళ్ల కోసం అన్ని మండల కేంద్రాల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చెల రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో నాలుగు మాత్రమే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయడం, మండల స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పత్తి రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు పంట దక్కించుకుంటున్నారన్నారు. అలాగే, అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయడంతో పాటు రైతుభరోసా అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లోనూ అన్నివర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సమావేశంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, నాయకులు చంద్ర అరుణ, నాయిని రాజు, మాచర్ల సత్యం, గోపాల్‌రావు, బానోత్ ధర్మ, పెద్దబోయిన సతీశ్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 14 గురుకులాల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారు. కాగా, రెండో రోజు పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అండర్–14 విభాగం షాట్‌పుట్‌లో పి.కీర్తి(నేలకొండపల్లి), టి.ఉమారాణి(అడవిమల్లెల), పి.సిప్పర (ఇల్లెందు), లాంగ్ జంప్‌లో జి.మంజుని(కల్లూరు), వి.వైష్ణవి(ఇల్లెందు), జి.శ్రీహర్షిణి(ఇల్లెందు), అండర్–17 షాట్‌పుట్‌లో ఎం.నిహర్షిత(భద్రాచలం), బి.ప్రవచన(ఇల్లెందు), కె.స్రవంతి(భద్రాచలం), లాంగ్‌జంప్‌లో సీ.హెచ్.వినీల(ఇల్లెందు), కె.స్రవంతి(భద్రాచలం), డి.సాగరిక(టేకులపల్లి) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–19 విభాగం షాట్‌పుట్‌లో టి.అన్విత(కల్లూరు), పి.నేహా(పాల్వంచ), వి.పవిత్ర (కూసుమంచి), లాంగ్ జంప్‌లో ఎస్.సరిత (ఇల్లెందు), ఎస్.గ్లోరి(టేకులపల్లి), డి.పూజశ్రీ(ములకలపల్లి), అండర్–17 3వేల మీటర్ల పరుగు పందెంలో టి.మానస(ఇల్లెందు), అక్కేల సాయిశ్రీ(ములకలపల్లి), కె.స్రవంతి(భద్రాచలం), అండర్–19 3వేల మీటర్ల పరుగు పందెంలో ఎస్.భావన(ములకలపల్లి), జి.పూజితశ్రీ(అంబేడ్కర్ కాలేజ్ ఖమ్మం), పి.సంధ్య(ఎర్రుపాలెం) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.